# అంకితభావం

"మా బాస్‌కేం ? కార్లో తిరుగుతాడు! మేడమీద మేడ కడ్తాడు ! ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టు నా బ్రతుకులో మాత్రం ఏ మార్పూ ఉండదు ! నేను 'ఎవడి' కోసమో శ్రమిస్తే - 'వాడే' బాగుపడ్తాడు! వాడెవడో తను 'ఒక్కడే' బాగుపడటానికి నేనెందుకు ఒళ్ళు గుల్ల చేసుకోవాలి ?" అని కార్మికుల మనసు రగిలి 'చిత్తశుద్ధి'తో పని చేయకపోతే.... సదరు ఫ్యాక్టరీకి నష్టాలొచ్చి 'సిక్‌యూనిట్' అయిపోతుంది!

"పెట్టుబడి నాది ! తెలివితేటలు నావి! 'శ్రమ' ఒక్కటే వాడిది ! అంతమాత్రాన నా లాభాల్లో ప్రతిఏటా వాళ్ళకి వాటా ఇవ్వాలా?" అని పెట్టుబడిదారులు గింజుకుంటూ- 'సమస్య' లోతు అర్థం చేసుకోకపోతే... కడుపుమండి - కార్మికులు విప్లవ శంఖం పూరిస్తారు ! కమ్యూనిస్ట్ దేశాల వైపు తమ చూపు సారిస్తారు!

**తీరా విప్లవం ఫలించి - సోషలిస్ట్ వ్యవస్థ ఏర్పడ్డాక....**

"నేను నాకోసమే శ్రమిస్తే 'నేను' బాగుపడ్తాను గానీ ఇలా 'అందరి' కోసం శ్రమిస్తే ప్రత్యేకంగా నాకేమిటి లాభం ? అందరికీ లాభం కల్గించే పనికోసం - నేను మాత్రమే ఎందుకు రెక్కలు ముక్కలు చేసుకోవాలి ? ఏదో పని చేస్తున్నట్టు నటిస్తే పోలా ?" అనే ఉదాసీనత - ఏ కమ్యూనిస్ట్ వ్యవస్థనైనా కూకటి వేళ్ళతో పెకిలించేలా చేసి - భూమి గుండ్రంగా ఉన్నట్టు - తిరిగి ప్రజా స్వామ్యం వైపు మొగ్గు చూపేలా చేస్తుంది!

కార్మికుల కడుపు మంటో, ఉదాసీనతో, యజమానుల స్వార్థమో, శ్రమ దోపిడో, కారణం ఏదైతేనేం - ఒకరు సమ్మెలకీ, మరొకరు లాకౌట్లకీ సిద్ధపడ్తే -

ఇద్దరూ కలిసి 'శ్రమ విలువ' ని తుంగలో తొక్కితే...

దేశంలో ఉత్పత్తి పడిపోయి.... జీవన ప్రమాణం తగ్గి - దేశాభివృద్ధి కుంటుపడి పోతుంది !

మానవశక్తి అపారంగా లభించే మన దేశంలో - తమలో శక్తి సామర్థ్యాలున్నా... శ్రమించడానికి ఇష్టపడని వ్యక్తులు కొందరైతే... ఒళ్ళు దాచుకోకుండా శ్రమిస్తూ - శ్రమ దోపిడీకి గురవుతోన్న వాళ్ళు మరికొందరు!

శ్రమదోపిడిని నివారించడానికీ, నిరోధించడానికీ మనదేశంలో

లేబర్ యూనియన్లున్నాయి !

'సోషల్ అవేర్‌నెస్' ఉంది !

కార్మిక చట్టాలున్నాయి !



*Contd...*

కానీ....

తమ 'శ్రమశక్తి' నుపయోగించని మనుషుల మూలంగా - ఎన్ని అద్భుతాల్నయినా సృష్టించగల 'మానవశక్తి' ఎలా నిరుపయోగమైపోతోందో.... విశ్లేషించే ప్రయత్నాలు దేశంలో ఎక్కడా జరక్కపోవడం మన బాధ్యతా రాహిత్యానికి చిహ్నం.

**సోమరితనం, ఉదాసీనతల 'చెద' సోకితే... ఏ 'ఇజం' అది ఎంత గొప్పదైనా సరే మొదలంటా కుప్పకూలిపోతుంది !**

'పనీ పాటాలేని వాడి మనస్సు దెయ్యాల కార్ఖానా' అన్నట్లు.... మనిషి తన శక్తిని ఉపయోగించుకుని - తనను తాను 'బిజీ' గా ఉంచుకోవడంద్వారా - అన్ని దురాలోచనలనూ దూరంచేసుకోగల్గుతాడు!

పనిలో 'అంకితభావం' ఒక్కటే...

మనిషిలోని అన్ని రుగ్మతలనూ తరిమి కొట్టి మనసుకి తేజస్సునిచ్చి - మనిషి చేత ఎవరూ నమ్మలేని 'పరమాద్భుతా'ల్ని చేయిస్తుంది!

01-11-1995